సాక్షి
వికారాబాద్

గురువారం । 20 । జూలై । 2023



జింక్ లోపం..

అధిక దిగుబడికి దోహదం చేసే జింక్‌ను ఉపయోగించడంలో రైతులు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. 8లో▸



కాంగ్రెస్‌ది విధ్వంస పాలన

ఆది నుంచి కాంగ్రెస్‌ది విధ్వంస పాలనేనని, బీఆర్‌ఎస్‌ది మాత్రం వెలుగుల పాలన అని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



పిండి రాలే.. జావ అందలే!

సర్కారు బడుల్లో ప్రభుత్వం చేపట్టిన రాగి జావ పంపిణీకి ప్రారంభంలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకులు కావలెను

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులలో నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి ఎస్. శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియను 1:3 నిష్పత్తిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 57 జనరల్, 2 ఒకేషనల్ పోస్టులను భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 చివరి తేదీ అని తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 28న నియామక పత్రాలు అందిస్తామని, ఆగస్టు 1న విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94410 16521ను సంప్రదించాలన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



గిర్మాపూర్‌లో నిర్మించిన గోడను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

పెద్దేముల్: మండల పరిధిలోని గిర్మాపూర్‌లో అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. సీసీరోడ్డుపై అనుమతి లేకుండా రాళ్లతో గోడను నిర్మించడంతో బుధవారం జేసీబీల ద్వారా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ దేవి శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించినా, కబ్జాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గిర్మాపూర్‌లో జంగం చంద్రశేఖర్ అనే వ్యక్తి సీసీ రోడ్డును ఆక్రమించి రాళ్ల గోడ నిర్మించాడు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సుశీల మూడు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా సదరు వ్యక్తి స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన పలువురు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డీఎల్‌పీఓ ఈమేరకు చర్యలు తీసుకున్నారు.

జీ20 సదస్సులో వికారాబాద్ యువకుడు



సదస్సులో ప్రసంగిస్తున్న చైతన్య

అనంతగిరి: న్యూయార్క్ కేంద్రంగా ఈ నెల 12న జరిగిన జీ 20 సదస్సులో వికారాబాద్‌కు చెందిన చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైవర్‌సిటీ ఇన్‌క్లూజన్ ఫర్ సస్టైనబుల్ గ్రోత్ అనే అంశంపై ఈ సదస్సు జరుగగా ఆయన వ్యాపార రంగంపై ప్రసంగించి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా చైతన్యను పలువురు ప్రముఖులు, వికారాబాద్ వాసులు అభినందించారు.

నకిలీ అల్లంపేస్టు విక్రయిస్తున్న ముఠా అరెస్టు



అల్లంపేస్టు డబ్బాలతో నిందితులు

పూడూరు: నకిలీ అల్లంపేస్టు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం చన్గోముల్ ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నెగూడలో నకిలీ అల్లం పేస్టు విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు అనుమానితులను అదుపులోకి విచారించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ గ్రామానికి చెందిన అబ్దుల్ సాబేర్, గోల్కొండకు చెందిన హుస్సేన్ హైమద్‌లుగా గుర్తించారు. ఈ మేరకు నాలుగు క్వింటాళ్ల అల్లం పేస్టును, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా సంగీత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా రెవెన్యూ అధికారిగా సంగీత నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈమె హైదరాబాద్ జిల్లా న్యాయాధికారిగా పని చేశారు. ఇక్కడ డీఆర్‌ఓగా పని చేసిన జేఎల్‌బీ హరిప్రియ మేడ్చల్ డీఆర్‌ఓగా బదిలీపై వెళ్లారు. హైదరాబాద్ యూఎల్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేసిన కేఎస్‌బీ కుమారిని రంగారెడ్డి జిల్లా లాండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా నియమించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.



తాండూరు రూరల్: కురుస్తున్న వర్షాలతో జీవం పోసుకున్న పత్తి పంట

మూడో రోజూ ముసురుకుంది

- జిల్లా వ్యాప్తంగా వానలు
- వరినాట్లకు సిద్ధమవుతున్న రైతన్న

జిల్లాలో మూడో రోజూ బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు వరి, కూరగాయల నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాస్త ఏపుగా పెరిగిన పంటలకు ఎరువులు వేస్తున్నారు. దీంతో ఎరువుల దుకాణాల వద్ద రైతుల సందడి నెలకొంది. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం ఆరంభం నుంచి జిల్లా పరిధిలో ఇవే భారీ వానలు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన 24 గంటలూ ఎడతెరిపి లేకుండా అన్ని ప్రాంతాల్లో వానలు కురుస్తున్నాయి. తాండూరులో మండలంలో 34 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా మర్పల్లిలో అత్యల్పంగా 0.22 వర్షపాతం నమోదయ్యింది. – వికారాబాద్

నకిలీపై గరం గరం

వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

- అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు
- రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ విత్తనాల విక్రయాలపై ఆగ్రహం
- ఏళ్లుగా సాగుతున్న రోడ్ల నిర్మాణాలపైనా కన్నెర్ర
- చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి సబితారెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

వికారాబాద్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. బుధవారం వికారాబాద్ మండలం మద్గుల చిట్టెంపల్లి డీపీఆర్సీ భవనంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు పలు అంశాల్లో అధికారులను నిలదీశారు. ప్రధానంగా నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారుల ఉదాసీనత, రేషన్ బియ్యం అక్రమ రవాణా.. పదో తరగతి ఫలితాల్లో అట్టడుగున నిలవటం..రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంలో తీవ్ర జాప్యం తదితర అంశాల్లో సభ్యులు మండిపడ్డారు. పనులు చేయకుండా కాలయాపన చేస్తూ నాలుగేళ్లుగా అధికారులు అవే కథలు చెబుతున్నారన్నారు. చివరకు మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేయటంతో సభ్యులు కాస్త శాంతించారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మినహా ఎమ్మెల్యేలు ఎవరు పాల్గొనలేదు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ సుభాషిణి ఆయా శాఖల అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సభ్యులు నిలదీసిన అంశాలు..

- విచ్చలవిడిగా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్ మండిపడ్డారు.
- నకిలీ విత్తన విక్రయాలపై దౌల్తాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు మైపాల్, మర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్ కలెక్టర్, మంత్రికి ఫిర్యాదు చేశారు. పలానా వ్యక్తి నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని స్థానిక ఏఓలు, ఏడీలకు ఫిర్యాదు చేస్తే వారితో కుమ్మక్కై ముందస్తుగా సమాచారం ఇస్తున్నారన్నారు. అధికారులు నామ్‌కేవాస్తేగా విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా డీఏఓ గోపాల్ స్పందిస్తూ దుకాణాలను పకడ్బందీగా తనిఖీ చేశామని, మళ్లీ తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తామని వివరణ ఇచ్చారు.
- పోడుభూములకు సంబంధించి అర్హుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని బొంరాస్‌పేట్ జెడ్పీటీసీ రేణుదేశాయ్ ఆరోపించారు. స్కూళ్లలో ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై మోటివేషన్ క్లాసెస్ నిర్వహించాలని సూచించారు.
- మర్పల్లి మండలం తుమ్మలపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఫాంల్యాండ్స్ విక్రయిస్తూ గ్రామ పంచాయతీ వాటర్ పైప్‌లైన్ కూడా ధ్వంసం చేశారని మండల జెడ్పీటీసీ నిలదీశారు. చర్యలు తీసుకుంటామని డీపీఓ తరుణ్ వివరణ ఇచ్చారు.
- విద్యా ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్నాయని ఈ విషయంలో పాఠశాలలను తనిఖీ చేసి సమస్యలు పరిష్కరించాలని నాలుగేళ్లుగా చెబుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని బంట్వారం జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మిషన్ భగీరథ పైప్‌లైన్ సమయంలో తవ్వేసిన రోడ్లకు మరమ్మతులు ఇంకెప్పుడు చేస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు.
- రోడ్లు, బ్రిడ్జీలు ప్రారంభించి ఎనిమిది సంవత్సరాలైన పూర్తి చేయడంలేదని పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ నిలదీశారు.
- గతేడాది ఏర్పడిన గుంతలకు, బ్రిడ్జీలకు ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారుకు సాక్షి పేపర్‌లో వచ్చిన క్లిప్పింగ్ చూపించి నిలదీశారు.

అవగాహన కల్పించండి: జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

పంట మార్పిడి, నూనె గింజల సాగు, మెలకువలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సూచించారు. సమావేశంలో సునీతారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే మనం చాలా వెనకబడ్డామని, మెరుగయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

భగీరథ నీరు ఎంతో స్వచ్ఛమైంది: కలెక్టర్

మనం కొనుక్కుని తాగే వాటర్ బాటిల్స్ కంటే మిషన్ భగీరథలో పంపిణీ చేస్తున్న నీరు చాలా మంచివని, అందరూ తాగాలన్నారు. ఈ మేరకు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మంజూరైన జీపీ భవనలు వెంటనే గ్రౌండింగ్ చేయాలి కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో సభ్యులు చేసిన సూచనలు, ఫిర్యాదులు పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని ఆయన మంత్రికి వివరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించం: మంత్రి సబితారెడ్డి

'నకిలీ విత్తానాలు ఎవరు విక్రయించినా ఉపేక్షించబోం.. పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయండి.. ఒకే వ్యక్తి అనేక సార్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నా ఎందుకు పీడీ యాక్టు నమోదు చేయలేదు.. వెంటనే చర్యలు తీసుకోండి' అని మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రెండు జిల్లాలను కలుపుతూ వెళ్లే రోడ్లకు పక్క జిల్లాలో మరమ్మతులు చేస్తే వికారాబాద్ జిల్లాలో ఎందుకు కావడంలేదన్నారు. ఇది ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో ఫలితాలు మెరుగుపడాలి.. ఇందుకోసం ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు.

దొంగలు దొరికారు

- 72 గంటల్లోనే చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- అదుపులో ఇద్దరు.. పరారీలో ముగ్గురు
- రూ.19 లక్షలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీ శేఖర్‌గౌడ్, చిత్రంలో నిందితులు

తాండూరు టౌన్: పనిచేసిన యజమాని ఇంటికే కన్నం వేశాడు ఓ వ్యక్తి.. ఇంట్లో భారీగా నగదు ఉందనే పక్కా సమాచారంతో రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడ్డాడు. ఇటీవల తాండూరు పట్టణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 72 గంటల్లో ఛేదించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రూ.19లక్షలను రికవరీ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. బుధవారం ఎస్పీ కోటిరెడ్డి తాండూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శేఖర్ గౌడ్, పట్టణ సీఐ రాజేందర్ రెడ్డితో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన వ్యాపారి ఎండీ వాజీద్ ఇటీవల ప్లాట్ విక్రయించగా రూ. 20 లక్షలు వచ్చాయి. ఈ మొత్తాన్ని ఇంట్లో పెట్టి ఈ నెల 14న హైదరాబాద్‌లో బంధువుల వివాహానికి వెళ్లాడు. తరువాతి రోజు ఇంట్లో చోరీ జరిగింది. రూ. 20లక్షలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు.

తెలిసిన వ్యక్తి పనే..

వాజీద్ వద్ద అబూబాకర్ ఖురేషి అనే వ్యక్తి గతంలో పనిచేశాడు. ఇంట్లో డబ్బు ఉందన్న సమాచారంతో దొంగతానికి ప్లాన్ చేశాడు. తన పెద్దమ్మ కొడుకు అబూ సోఫియాన్ ఖురేషికి విషయాన్ని చెప్పాడు. అదే కాలనీలో ఉంటున్న ఖలీల్, తౌసిఫ్, దీపక్ అలియాస్ కిట్టుతో కలసి ప్లాన్ వేశాడు. ఈ నెల 15న రాత్రి అబూబాకర్, ఖలీల్‌లు రాడ్‌తో తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. మిగిలిన ముగ్గురు బయటనే ఉండి పరిసరాలను గమనిస్తూ ఉన్నారు. బీరువాలో ఉన్న రూ. 20 లక్షలను ఎత్తుకెళ్లారు. అందులో రూ.లక్షను మొదట అందరూ పంచుకున్నారు. మిగిలిన రూ. 19 లక్షలను యాదిరెడ్డి చౌక్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న చెత్తకుప్పలో దాచి పెట్టారు. తరువాత వచ్చి నగదును తీసుకెళ్లి పంచుకుందామనుకున్నారు.

సీసీ కెమెరాలే పట్టించాయి

బాధితుడి ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను, పలు ముఖ్య కూడళ్లలోని కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అయితే మాణిక్ నగర్ వద్ద ఉన్న కెమెరాలో అబూబాకర్ ఖురేషి అనుమానాస్పద కదలికలను పోలీసులు గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసింది ఒప్పుకున్నాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు అబూ సోఫియాన్ ఖురేషిని అరెస్టు చేశామని, మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసు ఛేదనకు సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషించాయన్నారు. 72 గంటల్లోనే నిందితుల అరెస్టులో కీలకపాత్ర వహించిన కానిస్టేబుళ్లు అమ్జద్, శివ, సాయికుమార్, షబీల్‌అహ్మద్‌లను ఎస్పీ అభినందించి, రివార్డు అందజేశారు. పట్టుబడిన నిందితులు ఇద్దరినీ బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులు ఉపయోగించిన ఆటో, బైక్‌ను సీజ్ చేశామన్నారు. త్వరలోనే మిగిలిన ముగ్గురు నిందితులను కూడా పట్టుకుంటామన్నారు.

ఆనంద మృతజీవనుడు

- జీవన్మృతుడి అవయవ దానం
- గుండె, లివర్, ఇతర భాగాలు సేకరించిన వైద్యులు
- పుట్టెడు దుఃఖంలోనూ ఆదర్శంగా నిలిచిన ఆనంద్ తల్లిదండ్రులు



ఆనంద్ (ఫైల్)



ఆనంద్ మృతదేహానికి ఆస్పత్రి నుంచి అంతిమ వీడ్కోలు పలుకుతున్న వైద్యులు

షాద్‌నగర్: అర్ధంతరంగా ముగిసిన ఓ యువకుడి జీవనం.. ఆరిపోతున్న పలువురి బతుకులకు ప్రాణం పోసింది. దీంతో భౌతికంగా అతను లేకపోయినా.. మరికొందరికి ప్రాణదాతగా నిలిచాడు. గుండెల్లో నుంచి ఉబికి వస్తున్న దుఃఖాన్ని కళ్లల్లోనే ఆపుకొంటూ కుమారుడి అవయవాలు దానం చేసిన ఆ తల్లిదండ్రులు అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఏం జరిగిందంటే..

కేశంపేట మండలం పాపిరెడ్డిగూడకు చెందిన రాధాబాయి, పెంటోజీ దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు ఆనంద్(28) షాద్‌నగర్‌లోని తన సోదరి వద్ద ఉంటూ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. గత ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై షాద్‌నగర్ నుంచి పాపిరెడ్డిగూడకు వెళ్తుండగా కమ్మదనం శివారులోని మలుపు వద్ద అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడిపోయిన అతన్ని గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు.

మృత్యువుతో పోరాడి..


ఆనంద్ తలకు బలమైన గాయాలు కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. కొడుకును బతికించుకునేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స అందిస్తున్న వైద్యులు సోమవారం ఆనంద్‌ను జీవన్మృతుడిగా ధ్రువీకరించారు. ఆస్పత్రి వర్గాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానంపై బాధిత కుటుంబ సభ్యులతో చర్చించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ తిరిగిరాని తమ బిడ్డ అవయవాలను మరొకరికి దానం చేసేందుకు అంగీకరించారు. వైద్యులు ఆనంద్ శరీరంలో నుంచి గుండె, లివర్, ఇతర భాగాలను సేకరించారు. అవయవదానం చేసిన ఆనంద్‌కు ఆస్పత్రిలో అంతిమ వీడ్కోలు నిర్వహించారు.

నేడు బాట సింగారానికి కేంద్ర మంత్రి

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం బాటసింగారం గ్రామానికి రానున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొత్త అశోక్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న ప్రజాసమస్యలను గుర్తించడంలో భాగంగా బాటసింగారంలో ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తారని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసేవరకు బీజేపీ పోరాడుతుందని వెల్లడించారు. ఇప్పటికే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరూ కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, నాయకులు యాదగిరిరెడ్డి, అర్జున్‌రెడ్డి, ఎంపీ యాదగిరి పాల్గొన్నారు.

వైద్యుల పర్యవేక్షణలో నగేశ్

- కార్మికుడిని చావబాదిన ఘటనపై ఎస్పీ ఆరా
- పోలీసులతో అంతర్గత విచారణ!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేశ్

బషీరాబాద్: పోలీస్ స్టేషన్ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికుడు వడ్డే నగేశ్ మరో పది రోజుల పాటు తమ పర్యవేక్షణలో ఉంచాలని వైద్యులు సూచించారు. ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న నగేశ్ బుధవారం కొంత కోలుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై ఎస్పీ కోటిరెడ్డి బుధవారం అంతర్గత విచారణకు ఆదేశించారు. దీనిపై రహస్యంగా విచారణ జరుపుతున్న పోలీసులు హెడ్ కానిస్టేబుల్ మల్లేశం కొట్టలేదని అతడిని వెనకేసుకొచ్చారు. ఘటన మీడియాలో రావడంతో పీఎస్‌లో పనిచేసే స్వీపర్ అనసూయతో పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. నగేష్ ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకే వడ్డే నగేష్‌ను పీఎస్‌కు పిలిపించామని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ చెప్పుకొచ్చారు. నగేష్‌ను ఎవరు కొట్టలేదని, అతడు స్టేషన్‌కు వచ్చి రాగానే ఫిట్స్ వచ్చి కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ఇదిలా ఉంటే దెబ్బలు తిన్న బాధితుడు నగేష్ 'సాక్షి' తో మాట్లాడుతూ తనను హెడ్‌కానిస్టేబుల్ కొట్టారని, అప్పుడే కిందపడిపోయానని చెప్పాడు. తనకు ఎప్పుడూ ఫిట్స్ రాలేదని పోలీసులు కావాలనే ఇలా చెబుతున్నారని వాపోయాడు. దీనిపై తమకు న్యాయం జరగకపోతే మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బాధితుడి తల్లి శామమ్మ తెలిపారు.

నిరుద్యోగులను విస్మరించిన కేసీఆర్

- యువతకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలే..
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

పరిగి: నిరుద్యోగులను సీఎం కేసీఆర్ విస్మరించారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ పోరాటయాత్ర బుధవారం పరిగి పట్టణ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తుందన్నారు. 2 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నా నోటిఫికేషన్లు విడుదల చేయకుండా నిరుద్యోగులను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. 2018 బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం 1,91600 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నివేదిక అందించిందన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటికీ అమలు కాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు రు. 25వేల పెన్షన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరరెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

డీఎల్‌పీవో అమృత

కడ్తాల్: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కందుకూర్ డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) అమృత అన్నారు. బుధవారం కడ్తాల్ గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అమృత మాట్లాడుతూ గ్రామాలు, తండాలలో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వాహణలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పల్లెలు, గ్రామాలు, తండాలు ఆదర్శవంతంగా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుసూధనాచారి, వార్డు సభ్యులు మల్లయ్య, బిక్షపతి, మహిళ సంఘం సభ్యురాలు లావణ్య, కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఖానాపూర్‌లో మృతిచెందిన ఆవు వద్ద బాధితుడు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్‌లో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. ఖానాపూర్‌కు చెందిన కొప్పు మహేశ్ పాడి ఆవును తన వ్యవసాయం పొలంలోకి మేపేందుకు తీసుకెళ్లాడు. మేత మేస్తూ విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. ఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మహేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. సర్పంచ్ వెంకట్రామిరెడ్డి వ్యక్తిగతంగా బాధితుడికి రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం పరంగా సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చాడు.

కాంట్రాక్ట్ కార్మికుడి అదృశ్యం



రాజ్‌కపిల్ (ఫైల్)

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న హెచ్‌ఐఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ కార్మికుడు అదృశ్యమయ్యాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కపిల్ (20) కొన్ని నెలలగా హెచ్‌ఐఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదు. దీంతో తోటి కార్మికులు బుధవారం కంట్రాక్టర్ సోనుకుమార్‌కు సమాచామిచ్చారు. అతడి కోసం పలు ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో కొత్తూరు పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

వాహనం ఢీకొని రైతు మృతి



షాబాద్: స్కూటీని పాల వాహనం ఢీకొనడంతో రైతు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ కథనం మేరకు.. బొబ్బిల్లిగామ గ్రామానికి చెందిన రైతు దుర్గారెడ్డి(40) బుధవారం పురుగు మందు కొనుగోలు చేసేందుకు షాబాద్‌కు వెళ్లాడు. తన స్కూటీలో పెట్రోల్ అయిపోవడంతో సంకెపల్లిగూడలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చాడు. పెట్రోల్ పోసుకొని వస్తున్న క్రమంలో షాద్‌నగర్ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న పాలు వ్యాన్ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత నగరానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జింక్ లోపం.. పంటకు నష్టం



జింక్ ప్యాకెట్లు

- పంట పసుపు, ఎరుపు రంగులోకి మారడమే జింక్ లోపం
- నివారిస్తే అధిక దిగుబడులు
- ఏఈఓ భార్గవి సూచనలు, సలహాలు

బొంరాస్‌పేట: పంటలకు పోషకాలను అందించి అధిక దిగుబడికి దోహదం చేసే జింక్‌ను ఉపయోగించడంలో రైతులు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. జింక్ లోపిస్తే 10 నుంచి 20 శాతం వరకు పంట దిగుబడి తగ్గుతుంది. జింక్ లోపం, నివారణ చర్యలు, ఉపయోగాలను ఏఈఓ భార్గవి వివరించారు.

ఉపయోగాలు

మొక్కకు ఉపయోగపడే కిరణజన్య సంయోగ క్రియ, శ్వాస క్రియల తోపాటు అన్ని క్రియల్లో జింక్ ఉపయోగపడుతుంది. మొక్క బతకడానికి అన్ని జీవన క్రియల ఉత్పత్తిలో జింక్ ఉపయోగపడుతుంది. జింక్ లోపం లేకుండా చర్యలు తీసుకుంటే పంట 10 – 20 శాతం వరకు దిగుబడిని పెంచుకోవచ్చు.

జింక్ లోపం లక్షణాలు

జింక్ లోపం ఉన్న ఏ పంట అయినా పసుపు, ఆ తర్వాత ఎరుపు రంగులోకి మారుతుంది. ప్రధానంగా వరిలో ఆకు పెలుసు (పెడుసుగా) మారుతుంది. జింక్ లోపం తీవ్రమైతే ఆకుపై ఇటుక ఎరుపు రంగులో మచ్చలు కనిపిస్తాయి. మిగితా పంటల్లో పసుపు రంగులో కనిపిస్తుంది. మొక్క జొన్నలో సుడి ఆకు తెల్లగా మారుతుంది.

లోపానికి కారణాలు

▲ జింక్ లభ్యత తక్కువగా ఉంటే చౌడు నేలల్లో పీహెచ్(ఉదజని సూచిక) ఎక్కువగా ఉంటుంది.

▲ డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను మోతాదుకు మించి వాడితే భాస్వరపు నిలువ పెరిగి జింక్ లోపం ఏర్పడుతుంది.

నివారణకు చర్యలు

400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో రాత్రి నానబెట్టి ఉదయం వడ గట్టాలి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో పిచికారీ చేసుకుంటే జింక్ లోపాన్ని నివారించుకోవచ్చు.

కాంగ్రెస్‌ది విధ్వంస పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ఆది నుంచి కాంగ్రెస్‌ది విధ్వంస పాలనే, బీఆర్ఎస్‌ది మాత్రం వెలుగుల పాలన అని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని మీనపల్లి కలాన్, నవాబుపేట, ఎల్లకొండ, పులుమామిడి, చించల్‌పేట గ్రామాల రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయ రంగానికి కేవలం మూడు గంటల కరెంటే సరిపోతుందని రేవంత్‌రెడ్డి అనడంపై దారుణమన్నారు. 24 గంటలు కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్‌ది రైతుల ప్రభుత్వమన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌లో ఎక్కడా ఉచిత విద్యుత్ లేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు మాణిక్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్, రత్నం, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన కెన్యా దేశస్తులు



విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న కెన్యా దేశస్తులు

కొడంగల్ రూరల్: పాతకొడంగల్ గ్రామ సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులను కెన్యా దేశస్తులు అభినందించారు. పీఅండ్‌జీ శిక్ష కార్యక్రమంలో భాగంగా ఈఐ కంపెనీ మైండ్ స్పార్క్‌లో విద్యార్థులు చూయించిన ప్రతిభకు మెచ్చుకున్నారు. బుధవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని, ఆసక్తిని, ఆత్మస్థైర్యాన్ని కొనియాడారు.

విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. కెన్యా దేశానికి చెందిన విద్యా డైరెక్టర్ ఎన్‌జి.కిబాండి, పెయిత్‌నిసియో, టెర్రిస్‌లతోపాటు తెలంగాణకు చెందిన సూర్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



ధారూరు రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: రానున్న ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామనే ధీమాతో కాంగ్రెస్ వాళ్లు విర్రవీగుతున్నారని, రైతులు వారికి తగిన బుద్ధి చెప్పాలనీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. మండలంలోని కేరెల్లి, మున్నూరుసోమారం, ధారూరు, నాగసమందర్ గ్రామాల రైతువేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన ప్రసంగిచారు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయాయని తెలిపారు. రాత్రి వేళ సాగుకు విద్యుత్ ఇవ్వడం వల్ల రైతులు ప్రాణాలు పోయాయని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ హయాంలో నిరంతరంగా విద్యుత్ సరఫరా జరుగుతోందని అన్నారు. ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో చర్చ జరుగాలని, రైతులు సమష్టిగా కూర్చుని చర్చించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, జెడ్పీటీసీ సుజాత, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచులు నర్సింహారెడ్డి, చంద్రమౌళి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవించిన ముగ్గురికి రిమాండ్

మీర్‌పేట: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకుని, 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం... బుధవారం మీర్‌పేట లెనిన్‌నగర్ రైతుబజార్ సమీపంలోని ఖాళీ స్థలంలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. హుడా కాలనీకి చెందిన శివరాజ్ (23), లెనిన్‌నగర్‌కు చెందిన జర్పుల బలరాం (22), జర్పుల కుమార్ (25)ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 100 గ్రాముల 3 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఎడతెరిపి లేని ముసురు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- జలమయమైన రహదారులు

మొయినాబాద్‌రూరల్: మండలవ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తూనే ఉంది. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షం నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా హైదరాబాద్–బీజాపూర్ రహదారి టోల్‌కట్ట నుంచి గండిపేట చౌరస్తా వరకు కనకమామిడి, హిమాయత్‌నగర్ చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తా, ఆయా గ్రామాల్లో మురుసు వర్షంతో రహదారిపై వర్షం నీరు భారీగా చేరింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. రోడ్లకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరుగురికి రిమాండ్

మీర్‌పేట: ఓ యువకుడి హత్య కేసులో మీర్‌పేట పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట సర్వోదయనగర్ కాలనీకి చెందిన మానుపాటి సాయి వరప్రసాద్ (22) ఈ నెల 16వ తేదీ ఆదివారం రాత్రి 12.30 గంటలకు స్నేహితులు భార్గవ్, ధనుష్‌తో కలిసి బీర్ బాటిళ్లు తీసుకుని వెళ్తున్నాడు. అక్కడే ఉన్న మీర్‌పేటకు చెందిన ఎరుకల నితీష్‌గౌడ్ అతని స్నేహితులు బీర్ బాటిళ్లు ఇవ్వాలని బెదిరించారు. నితీష్‌గౌడ్ కత్తితో వరప్రసాద్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నితీష్‌గౌడ్‌తో పాటు ఆర్ఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన ఇందుర్తి మహేందర్ రెడ్డి (20), జిల్లెలగూడకు చెందిన కుంటాల సాయి కిరణ్‌గౌడ్ (31), నిమ్మగుడుపు మనోహర్‌గౌడ్ (34), శంషాబాద్ పెద్దతుప్పర గ్రామానికి చెందిన కాటుకూరి సురేష్‌గౌడ్ (36), వెంకటేష్‌గౌడ్ (39)పై హత్యానేరం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, ఆయుధచట్టం కింద కేసులు నమోదు చేశారు.

రైతులపై దాడి అమానుషం: కాంగ్రెస్



ధారూరు పీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ధారూరు: ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు సమస్యలు విన్నవించేందుకు వచ్చిన రైతులు, కాంగ్రెస్ నాయకులపై దాడి చేయడం అమానుషమని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని మున్నూరుసోమారం గ్రామ రైతు వేదికలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నదాతలతో సమావేశం నిర్వహించారు. రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ గురించి ప్రశ్నించేందుకు తాము రైతులతో కలిసి వెళ్లినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అయితే బీఆర్ఎస్ నేతలు తమను అడ్డుకొని దాడి చేశారని తెలిపారు. రైతులను పోలీసులతో కొట్టించి అరెస్టు చేశారని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. 24 గంటల పాటు విద్యుత్ కాదని, మద్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం దారూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి హెచ్చరించారు. ప్రజా సమస్యలపై అడిగే హక్కు ఎవ్వరికైనా ఉంటుందని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని దాడులను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజలు వాస్తవమేంటో గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆచారి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

కడ్తాల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి. ఆచారి ధీమా వ్యక్తం చేశారు. స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెలుగురాళ్ల తండా, మైసిగండి, చిన్నవేముబావితండా, గడ్డమీది తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రప్రభుత్వం 9ఏళ్లుగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్య, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేశ్, ఆశోక్‌రెడ్డి, సాయిలాల్, రెడ్యా, లక్ష్మన్, చందన్, రాందాస్, శ్రీశైలం గౌడ్,వెంకటేశ్, దశరథ్, ప్రేమ్‌కుమార్,సాయిప్రభు ఉన్నారు.

రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి హెచ్చరించారు. దేశంకోసం గాంధీ కుటుంబం ప్రాణాలర్పించిందని గుర్తుచేశారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ యువ పోరాట యాత్ర బుధవారం వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. యువజన కాంగ్రెస్ అంటే ఏంటో సీఎం కేసీఆర్‌కు తెలుసన్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగానే కేసీఆర్ రాజకీయ ప్రస్థానం మొదలైందని తెలిపారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. ఎమ్మెల్యే ఆనంద్‌కు రాజకీయ అనుభవం లేదని విమర్శించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కృష్ణంరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, నాయకులు భాస్కర్, వెంకటేశం, రవి, ఎర్రవల్లి జాఫర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసు

ఎమ్మెలే అంజయ్యయాదవ్

కొందుర్గు: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన సముదాయాన్ని, రైతువేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈటగణేశ్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సర్పంచ్ ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ మధుసూదన్ వివిధ గ్రామాల ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.2,931 కోట్లతో అభివృద్ధి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: నియోజకవర్గంలో రూ. 2931 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కిషన్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధుల కొరత లేకుండా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అంతర్జాతీయ సంస్థలు, ఫార్మాసిటీల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డి లాంటి నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డి, కౌన్సిలర్లు రొక్కం అనితా చంద్రశేఖర్ రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, కవిత, శ్రీలత, రవీందర్ రెడ్డి, మల్లేష్, కోఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహారెడ్డి, మరియమ్మ చిన్నయ్యతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- అనుమతులు లేకున్నా వెలుస్తున్న బహుళ అంతస్తులు
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు



ఆదిబట్లలో అక్రమ నిర్మాణాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అనుమతులు గోరంతా నిర్మాణాలు కొండంతా అన్న చందంలా వ్యవహరిస్తున్నారు అక్రమార్కులు. నిర్మాణాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అక్రమ నిర్మాణాలకు షాడో ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు

మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో అత్యధికంగా టీసీఎస్, ఆదిబట్ల, కొంగరకలాన్, మంగళ్‌పల్లి ప్రాంతాల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. టీసీఎస్ పోలీస్‌స్టేషన్ ముందు చేపట్టే నిర్మాణాలకు స్టిల్ ప్లస్ టూ మాత్రమే అనుమతులు పొందారు. కానీ ఇక్కడ ఒకేసారి పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపడుతున్నారు. మంగళ్‌పల్లి గేటు వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొంది. నిర్మాణాలకు ఒక ప క్క ప్లాస్టింగ్ చేయడం, మరో పక్క సున్నం వేయ డం చేస్తున్నారు. అంతా చకచకా ముగిస్తున్నారు.

అక్రమాలకు అండదండలు

ఆదిబట్లలో జరిగే అక్రమ నిర్మాణాలకు ఓ షాడో ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. రియల్టర్లు, బిల్డర్లను ముడుపులు ఇవ్వాలని బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే అధికారులకు సమాచారమిచ్చి నిర్మాణాలను నిలిపివేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే అనేకసార్లు ఇలాంటి ఘటనలు జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలసెంట్రింగ్ సామగ్రి, పారలు, గంపలు, కటింగ్ మిషన్లు ఎత్తుకెళ్లారని నిర్మాణదారులు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

పట్టణంలో జరిగే నిర్మాణలపై మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. కానీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. భవనాలు పూర్తైనా అక్రమార్కుల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి



అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు. మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచే ప్రసక్తే లేదు. అధికారులు వెంటనే కూల్చివేయాలి. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. టౌన్ ప్లానింగ్ అధికారుల, మున్సిపల్ కమిషనర్ స్పందించాలి. ఎక్కడ అక్రమాలు జరిగినా చర్యలు తీసుకోవాలి. బహుళ అంతస్తుల నిర్మించుకునేవారు అనుమతులు పొందాలి.

– కళమ్మ, వైస్ చైర్‌పర్సన్, ఆదిబట్ల మున్సిపాలిటీ

చర్యలు తీసుకుంటాం



ఆదిబట్లలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న మాట వాస్తవమే. అనేక మార్లు హెచ్చరికలు జారీ చేశాం. అయినా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే నోటీసులిచ్చాం. ఎలాంటి అక్రమాలు, అవినీతి జరగడం లేదు. విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకునేలా చేస్తాం.

– అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల